సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

I

బుధవారం । 1 । మే । 2024

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొత్తగూడెం రోడ్ షోలో గులాబీ దళపతి కేసీఆర్



పార్టీ ముఖ్యనేతలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లా వెనకబాటుకు గురైందని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అనేక సమస్యలు ఉండేవని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలుతో పాటు పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జిల్లాల రద్దుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆనాడు చర్ల, దుమ్ముగూడెం తదితర మండలాల వారు ఖమ్మం రావాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేదని, నేడు మళ్లీ అదే పరిస్థితిని తీసుకొచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు నామ నాగేశ్వరరావు, మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రాత్రి కొత్తగూడెంలో నిర్వహించిన రోడ్‌షోలో అయన మాట్లాడారు. –సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

-వివరాలు IIలో

రుణమాఫీ తప్పకుండా చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని, ఆగస్టు 15న ప్రభుత్వం తప్పకుండా చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం మండలంలోని అల్లిపల్లి గ్రామంలో అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొనగా మంత్రి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో పనిచేసి, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15న తప్పకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలకమైన పాత్ర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలపాటి ప్రసాద్, మొగళ్ల చెన్నకేశవులు, జ్యేష్ట సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, అడపా రాంబాబు, దొడ్డా ప్రసాద్, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

కొత్తగూడెంటౌన్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పి.పరంధామరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో ఉచితంగానే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, 14 ఏళ్ల లోపు బాలబాలికలకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారులు క్రీడల్లో నైపుణ్యం సాధించేలా ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు.

డీఎంహెచ్‌ఓకు అభినందన

కొత్తగూడెంరూరల్: గర్భిణులకు వైద్య పరీక్షలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, అమ్మకోసం, ఆరోగ్య మహిళ వంటి పథకాల అమలులో జిల్లా ముందున్న నేపథ్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, జిల్లా మాతా, శిశు సంరక్షణాధికారి చైతన్యను ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అభినందించారు. హైదరాబాద్‌లోని డీహెచ్ కార్యాలయంలో మంగళవారం అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియానా, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు ప్రశంసించారు. అనంతరం శిరీష, చైతన్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు తమను అభినందించడం సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

సామాజిక సేవలో ముందుండాలి : ఎస్పీ

బూర్గంపాడు: 60 ఏళ్లు నిండే వరకు పోలీస్ శాఖలో విశేష సేవలు అందించిన బూర్గంపాడు ఏఎస్సై సత్యనారాయణ ఉద్యోగ విరమణ తర్వాత కూడా సామాజిక సేవలో ముందుండాల ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన సత్యనారాయణ దంపతులను ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్యనారాయణ పోలీస్ శాఖలో భాద్యతాయుతంగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల, ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఇకపై ఆయన కుటుంబంతో ఆనందంగా గడపాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అంతకుముందు బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.

చేపల చెరువులతో గిరిజనులకు ఉపాధి

చర్ల: నిరుపేదలైన గిరిజన రైతులు జీవన భృతిని పెంచుకోవడానికి చేపల చెరువులు ఎంతగానో ఉపయోగపడతాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. చర్ల మండలంలోని లెనిన్‌కాలనీకి చెందిన గిరిజన రైతులు కుంజా రాజేశ్, కృష్ణ.. ఐటీడీఏ నిధులతో చేపల చెరువుల నిర్మాణం చేపట్టారు. మంగళవారం పనులను పరిశీలించిన పీఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ చెరువుల నిర్మాణం పూర్తయిన తర్వాత నీళ్లు పూర్తిస్థాయిలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. చెరువు చుట్టూ గెట్లు వేయించాలని, నీరు నిండిన తరువాత సరైన సమయంలో చేప పిల్లలను వదలాలని సూచించారు. పీఓ వెంట మత్స్యశాఖ అధికారి అశోక్, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

రామాలయ రూ.26.81 కోట్ల ఆడిట్ అభ్యంతరాలు రద్దు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయానికి చెందిన రూ.26.81 కోట్ల ఆడిట్ అభ్యంతరాలను అధికారులు రద్దు చేసినట్లుగా ఈఓ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించి 2021 – 22 వరకు 1,088 అభ్యంతరాలతో రూ.91 కోట్లు ఉన్నాయి. వీటిలో దేవస్థానం అధికారుల వినతితో 51 అభ్యంతరాలకు ఉన్న రూ.26,81,04,835 రూపాయలను జిల్లా ఆడిట్ విభాగం పరిశీలించి రద్దు చేసింది. ఆడిట్ అభ్యంతరాలను రద్దు చేసినందుకు గాను రాష్ట్ర ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డీఏఓ డి.రాజు, ఇతర సిబ్బందికి ఈఓ రమాదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లెందు సబ్‌జైలును సందర్శించిన జడ్జి

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి మంగళవారం ఇల్లెందు సబ్ జైలును సందర్శించారు. అక్కడి ఖైదీలకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ సదుపాయం కల్పిస్తామని, న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. జైలులో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. ప్రతీరోజు ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎన్.చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ సీహెచ్ భుజంగరావు, సబ్ జైలు సిబ్బంది శోభన్, శాంతి స్వరూప్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కొత్తగూడెం జిల్లా రద్దుకు కాంగ్రెస్ కుట్ర
- రాబోయే ఎన్నికల్లో మా పార్టీ అభ్యర్థులను గెలిపించండి
- కొత్తగూడెం రోడ్‌షోలో గులాబీ దళపతి కేసీఆర్



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు నామ, కవిత తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం జిల్లాను రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే జిల్లా, రాష్ట్రం అభివృద్ధి చెందాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన కొత్తగూడెంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ కూడలిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు చర్ల, వాజేడు, దుమ్ముగూడెం వంటి ఏజెన్సీ మండలాలు ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి వందల కిలోమీటర్ల దూరంలో ఉండేవని, అక్కడి ప్రజలకు పరిపాలనను మరింత దగ్గరికి తెచ్చే లక్ష్యంతో కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే కొత్తగూడెంలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని చెప్పారు. పినపాక నియోజకవర్గంలో దొంగతోపు వంటి మారుమూల పల్లెకు కూడా మిషన్ భగీరథ ద్వారా నీళ్లు ఇచ్చామని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 1.50 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు జారీ చేయడమే కాక రైతు బంధు కూడా ఈ జిల్లాలో అందించామని చెప్పారు. కానీ ఈరోజు కొత్తగూడెం జిల్లాను రద్దు చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా లాభాల్లో కార్మికులకు బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు. గిరిజనుల కోసం హైదరాబాద్‌లో బంజారా భవన్, కొమురంభీం భవన్‌లను తమ ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. గోదావరి నీటిని ఏన్కూరు, జూలూరుపాడు వంటి ఎత్తయిన ప్రాంతాలకు అందించేందుకే సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో మత కలహాలు లేవన్నారు. రంజాన్ మాసంలో తోఫాలు అందించామని, ఇప్పుడవి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అచ్చేదిన్, బేటీ పడావో అంటూ చెప్పిన నరేంద్రమోదీ చివరకు సాధించింది ఏమీ లేదని విమర్శించారు. ఈ జిల్లా ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలంటే ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు నామ నాగేశ్వరరావు, మాలోతు కవితను రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతామధు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియ, రేగా కాంతారావు, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

గూడెం.. జనసంద్రం

కేసీఆర్ రోడ్‌షోతో కొత్తగూడెం జనసంద్రంగా మారింది. కేసీఆర్ రాక కోసం పట్టణ శివారు నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్రజలు రోడ్డు పొడవునా బారులుదీరారు. సాయంత్రం ఆరు గంటల నుంచే రోడ్లపై గులాబీ దళం కదనోత్సాహం చూపించింది. రాత్రి 7:58 గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టారు. ఆయన మాట్లాడుతుండగా ప్రజలు ఆసక్తిగా విన్నారు. చాలాసార్లు సభికుల ఉత్సాహాన్ని కేసీఆర్ కంట్రోల్ చేయాల్సి వచ్చింది.

గులాబీ నేతకు ఘన స్వాగతం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికలలో ఖమ్మం, మహబూబాబాద్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు జనం బ్రహ్మరథం పట్టారు. భారీ జన సందోహంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలతో కొత్తగూడెం ప్రధాన కూడళ్లు గులాబీమయమయ్యాయి. సంప్రదాయ, గిరిజన నృత్యాలు, డప్పు వాయిద్యాలతో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కళాకారులు ఆటపాటలతో అలరించారు. సాయంత్రం 5 గంటలకు రోడ్ షో ప్రారంభం కావాల్సి ఉండగా రెండున్నర గంటలు ఆలస్యమైంది.

ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం..

కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో కేసీఆర్ మంగళవారం రాత్రి ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా ప్రచార సరళి ఉండాలని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, అమలు తీరును వివరిస్తూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు నామ నాగేశ్వరరావు, మాలోత్ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ మంత్రులు వనమా వెంకటేశ్వరరావు, పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ హరిప్రియ, మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి


ముగ్గులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ ఎం.విద్యాచందన

చుంచుపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు అత్యంత కీలకమని, పాలన సాకారం కావాంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ ఎం.విద్యాచందన తెలిపారు. మంగళవారం పాత డీఆర్డీఓ కార్యాలయం వద్ద స్వీప్, జిల్లా మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై మహిళా సమాఖ్యలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ ఆధ్వర్యంలో అనేక అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని, పల్లె, పట్టణాల్లో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై పూర్తిస్థాయిలో కళాబృందాలతో వివరిస్తున్నామని తెలిపారు. డీఆర్డీఏ సిబ్బంది, మహిళా సమాఖ్యలు సైతం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయస్వామి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.ఉమారాణి, డీపీఎంలు, సెర్ప్, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

బూర్గంపాడు: సారపాకలోని తెలంగాణ మైనారిటీ జూనియర్ కళాశాల (బాలికలు)లో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలంగాణ మైనారిటీ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు తక్కువ సీట్లు ఉన్నందున ఆసక్తి ఉన్న విద్యార్థినులు వెంటనే సర్టిఫికెట్లతో మే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 91107 56551 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు రామాలయ హుండీ లెక్కింపు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ ఎల్. రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చిత్రకూట మండపంలో లెక్కిస్తామని, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం రావొద్దు..


మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

మణుగూరుటౌన్: యంత్రాల పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ బ్రేక్ డౌన్‌కు అవకాశం లేకుండా రానున్న వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఈఅండ్ ఎం.సత్యనారాయణ అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత కేసీహెచ్‌పీలో బొగ్గు సరఫరా ప్రక్రియ, డిస్పాచ్‌ను సందర్శించారు. అనంతరం ఓసీ–4 వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు భారీ యంత్రాల పనిగంటలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. వానాకాలంలో క్వారీల్లో నీరు నిల్వకుండా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కార్మికులకు వైద్యపరంగా అందాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జీఎం సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో మాట్లాడారు. స్టోర్ ఇన్వెంటరీ మెటీరియల్ తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఓటూ డైరెక్టర్ (ఈఅండ్ఎం) కేవీ రావు, అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, నర్సిరెడ్డి, రమేశ్, వీరభద్రుడు, రవీందర్, శ్రీనివాస్, అబ్దుల్ షబ్బీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

అదృశ్యమైన యువకుడు విగతజీవిగా..

పాల్వంచరూరల్: నాలుగు రోజుల కిందట అదృశ్యమైన యువకుడు అడవిలో చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించిన ఘటన మంగళవారం మండలంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బంజర జీపీ చిరుతానిపాడు గ్రామానికి చెందిన పద్దం ఉంగయ్య (21) ఈ నెల 26న కనిపించకుండా పోగా సోమవారం ఉంగయ్య తండ్రి భీమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజుల అనంతరం ఉంగయ్య మంగళవారం చిరుతానిపాడు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఉంగయ్య నెలరోజుల కిందట ప్రేమ వివాహం చేసుకోగా.. ఈ విషయంలో పలుమార్లు పంచాయితీ జరిగినట్లు తెలిసిందని ఎస్‌ఐ వివరించారు.

జామాయిల్ తోట దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాల్వంచరూరల్: జామాయిల్ తోటకు నిప్పు అంటుకుని దగ్ధమైన ఘటన పునుకుల గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని పునుకులలో ప్రధాన రహదారి పక్కన మందలపు వెంకటేశ్వర్లుకు చెందిన రెండు ఎకరరాల జామాయిల్ తోటకు మంగళవారం నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్ ఆఫీసర్ పుల్లయ్య, సిబ్బంది సైదులు, శ్రీను, శివ పాల్గొన్నారు. కాగా, రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా రైతు బానోత్ రాంజీకి చెందిన జామాయిల్ తోట దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రోజూ మాదిరిగానే జామాయిల్ తోటకు వెళ్లిన రాంజీ.. సుమారు 2.5 ఎకరాల విస్తీర్ణంలో తోట కాలిపోయి ఉండటం గమనించాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా? గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా నిప్పు అంటించారా? అనే విషయం తెలియదని రైతు వాపోయాడు. తోట కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాంజీ తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి

పాల్వంచ: జామాయిల్ కర్ర నరికేందుకు వచ్చిన కూలీ వడదెబ్బకు గురై మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా చమ్మగడ్డ మండలం నుంచి సుమారు 40 మంది వరకు పాల్వంచ మండలం పునుకుల గ్రామంలో జామాయిల్ కర్ర నరికేందుకు డీసీఎం వాహనంలో వచ్చారు. మంగళవారం కర్ర నరుకుతుండగా జర్త నగేశ్ (28) వడదెబ్బ తగిలి సొమ్మసిల్లి పడిపోయాడు. కొద్ది సేపటికే అపస్మారక స్థితికి చేరడంతో పాటు, కడుపు ఉబ్బింది. దీంతో అతడిని పాల్వంచలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే నగేశ్ మృతి చెందాడు. మృతుడు చమ్మగడ్డ మండలం జంగాలతండాకు చెందిన అవివాహితుడిగా గుర్తించారు. మృతదేహాన్ని సొంత గ్రామానికి తరలించారు.

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
బుధవారం ॥ 1-5-2024



ప్రతి శ్రమకూ ఒక విలువ ఉంటుంది.
పురుషుడు విలువ కలిగిన శ్రమే చేస్తాడు.
అతడిది ఉద్యోగం.
స్త్రీ విలువ కట్టని ఇంటి పని చేస్తుంది.
ఆమెది చాకిరి.
భారతదేశంలో స్త్రీ, పురుషుల్లో స్త్రీలు అత్యధిక గంటలు ఏ ఖరీదూ లేని ఇంటి పనుల్లో మునిగి ఉంటున్నారని సర్వేలు చెబుతున్నాయి.
దేశ యంత్రాంగాలు అంతరాయం లేకుండా ముందుకు సాగడంలో ఈ శ్రమ నిశ్శబ్ద పాత్ర వహిస్తోంది.
స్త్రీల శ్రమకు విలువ కట్టలేకపోతే కనీసం గౌరవం ఇవ్వడమైనా నేర్వాలి.

నేడు మే డే

ఖరీదు కట్టే షరాబు లేదు

ఇంతకు ముందు వివరించి చెప్పడం కొంత కష్టమయ్యేది. ఇప్పుడు అర్బన్ క్లాప్ వంటి సంస్థలు వచ్చాయి కనుక సులువు. అర్బన్ క్లాప్ వారికి బాత్‌రూమ్‌ల క్లీనింగ్ కోసం కాల్ చేస్తే వాళ్లు ఒక్కో బాత్‌రూమ్‌కు ఇంతని చార్జ్ చేస్తారు. ఇంట్లో రెండుంటే రెంటికీ చార్జ్ పడుతుంది. అదీ ఒకసారికి. అమ్మ వారంలో రెండు సార్లు, నెలలో ఏడెనిమిది సార్లు రెండు బాత్‌రూమ్‌లు కడుగుతుంది. ఆమెకు ఆ చార్జ్ మొత్తం ఇవ్వాలి లెక్క ప్రకారం. అలాగే కిచెన్ క్లీన్ చేయాలంటే కూడా ఒక చార్జ్ ఉంటుంది. అమ్మ రోజూ వంటిల్లు సర్ది సర్ది, ప్లాట్‌ఫామ్ కడిగి, స్టవ్ రుద్ది క్లీన్ చేస్తుంది. ఆ చార్జ్ కూడా ఆమెకు ఇవ్వాలి. అమ్మ శ్రమకు కనీసం విలువ కట్టాలని కొన్ని సందర్భాలలో కోర్టులు కూడా అంటున్నాయి. కొన్ని సంస్థలు అమ్మ శ్రమను ఎలా విలువ కట్టవచ్చో కూడా చెబుతున్నాయి.

1. ఆపర్చునిటీ కాస్ట్ మెథడ్:
అంటే అమ్మ బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తే నలభై వేలు వస్తాయనుకుంటే, ఆమె ఆ ఉద్యోగం మానుకుని ఇంట్లో ఉండిపోతే ఆమె శ్రమ విలువను నెలకు నలభై వేలుగా గుర్తించాలి. (అమ్మ ఉద్యోగం చేసి కూడా అంత శ్రమా చేస్తుంటే నలభైకి మరో నలభై కలిపి ఇంటికి ఇస్తున్నట్టు).

2. రీప్లేస్‌మెంట్ కాస్ట్ మెథడ్:
ఇల్లు చిమ్మడం, బట్టలుతకడం, ఆరిన బట్టల్ని మడత పెట్టడం, ఇస్త్రీ చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడం, బిల్లులు కట్టడం, వంట చేయడం, ఇంటిని కనిపెట్టుకుని ఉండటం... వీటన్నింటినీ బయట వ్యక్తులతో సర్వీసుగా తీసుకుంటే (అర్బన్ క్లాప్ మాదిరిగా) ఎంత



అవుతుందో లెక్కగట్టి అది అమ్మ చేసే పని శ్రమగా గుర్తించడం.

3. ఇన్‌పుట్/అవుట్‌పుట్ కాస్ట్ మెథడ్:
అలా కాకుండా ఈ పనులన్నింటికీ ఒక యోగ్యమైన ఉద్యోగిని పెట్టుకుంటే మార్కెట్ అంచనాను బట్టి ఎంత జీతం ఇవ్వాల్సి వస్తుందో అంత జీతం ఇవ్వడం.

అవన్నీ సరే. కంటికి కనిపించే పనులకు కట్టే విలువ. కాని పిల్లవాడు స్కూల్లో పడి దెబ్బ తగిలించుకుని ఇంటికి వస్తే అమ్మ దగ్గరకు తీసుకుని, మందు రాసి, ధైర్యం చెప్పి, వాడి పక్కన కూచుని కబుర్లు చెపుతుందే... ఆ ప్రేమకు విలువ కట్టే షరాబు ఉన్నాడా?

మే డే రోజున ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదాలు వినిపిస్తుంటాయి. కాని ఇంటి పని చేస్తూ, అది ఎక్కువైనా చేస్తూ, కుటుంబమంతా ఆ పనిలో భాగం కావాలన్న సంగతిని చెప్పడానికి కూడా తటపటాయిస్తూ, అది వద్దనుకుంటే ఆ ఆప్షన్ లేక, తప్పించుకోవడానికి వీల్లేని ఆ పనిని చేస్తూ కూడా విలువ లేని పని చేస్తున్నామన్న న్యూనతను అనుభవిస్తూ తమ హక్కులు ఏమిటో తమకే తెలియని తల్లి, భార్య, కుమార్తె, చెల్లెళ్లను కార్మికులుగా గుర్తించాలని ఎవరూ అనుకోరు.

స్త్రీల ఇంటి శ్రమ దేశంలోని యంత్రాంగం సజావుగా పనిచేయడంలో కీలకమైనది. వారు...
1. దేశం కోసం పని చేసి రిటైరైన వృద్ధుల సేవలో ఉంటారు. 2. దేశానికి ఆదాయం తెచ్చిపెట్టే యువత సేవలో ఉంటారు. 3. దేశానికి భవిష్యత్తులో అంది రావాల్సిన పిల్లల సేవలో ఉంటారు.

'కుటుంబం' అనే బంధంలోకి వచ్చి కూతురిగా, కోడలిగా, భార్యగా వీరు 'ప్రేమ'తో, 'బాధ్యత'తో, 'బంధం'తో ఈ సేవ చేస్తారు. అంత మాత్రం చేత ఈ సేవను నిరాకరించడానికి వీల్లేదు. శ్రమగా చూడక్కర్లేదని భావించకూడదు. ఇంత చేస్తున్నా 'ఇంట్లో కూచుని ఏం చేస్తుంటావ్?' అనే మాటను వాళ్లు పడాలా?

ఉద్యోగం చేసినా చేయకపోయినా ఒక గృహిణి రోజుకు సగటున మూడున్నర గంటలు ఇంటి పని చేస్తుంటే పురుషుడు కేవలం గంటన్నర ఇంటి పని చేస్తున్నాడు.

స్త్రీలు తమ ఇంటి పనిని ఒక్కరోజు మానేసి సహాయనిరాకరణ చేస్తే దేశం స్తంభిస్తుంది. అందుకే స్త్రీల శ్రమను గౌరవించే మే డే రోజున వారికి కృతజ్ఞతలు తెలియచేయాలి. విలువైన శ్రమ చేస్తున్నందుకు సమాజం వారికి హర్షధ్వానాలు తెలియచేయాలి.



1. సాచి 2. ఇలీన హ్యాట్స్ 3. అవంతి 4. అనన్య నందా 5. అంకిత కుందు 6. రణిత బెనర్జీ 7. లిష మిశ్రా 8. మిథాలీ ఠాకూర్ 9. దియా వదిరాజ్

సెల్ఫ్-మేడ్ మ్యూజిక్ స్టార్స్

క్షణ క్షణం సంగీత పర్వం

యూత్ పల్స్

యువ సంగీతాభిమానులకు అచ్చంగా సరిపోయే మాట... మ్యూజిక్ మేక్స్ ఎవ్రీ థింగ్ బెటర్. ఇట్టే మరిచిపోయే లక్షణం నుంచి జ్ఞాపకశక్తి పెరగడం వరకు, క్రియేటివిటీని ఎంజాయ్ చేయడం నుంచి క్రియేటివ్ పవర్ పెంచుకోవడం వరకు, జడత్వం నుంచి నిత్యజీవనోత్సాహం వెల్లివిరియడం వరకు, అనామకత్వం నుంచి ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగడం వరకు ఎన్నోరకాలుగా సంగీతం యువతకు బలం అయింది. సంగీత రత్నాలను వెదుకుతూ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలోకి అడుగు పెట్టిన యువతరం ఆ ప్లాట్‌ఫామ్‌లలోనే మ్యూజిక్ స్టార్‌లుగా మెరవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రత్యేకత.

ఆరు సంవత్సరాల వయసులో పాటల కోసం గొంతు సవరించింది బెంగళూరుకు చెందిన దియా వదిరాజ్. రకరకాల మ్యూజిక్ జానర్‌లలో టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది. కోల్‌కతాకు చెందిన రనితా బెనర్జీ అయిదు సంవత్సరాల వయసులో 'సింగింగ్ స్టార్' షోలో పాల్గొంది. 'స రే గ మ ప' లిటిల్ ఛాంప్స్‌లో ఫస్ట్ రన్నర్-అప్‌గా నిలిచింది. 'స్వీట్ వాయిస్' రనిత గొంతు నుంచి వచ్చిన 'జరాసీ ఆహట్' పాట 6.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

మల్టీ టాలెంటెడ్ సింగర్‌గా పేరు తెచ్చుకుంది అంకిత కుందు. రియాల్టీ షోలలో పాడడం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. బిహార్‌కు చెందిన మిథాలీ ఠాకూర్ 'రైజింగ్ స్టార్' షోతో ఫేమ్ అయింది. భోజ్‌పురి, క్లాసికల్, ఫోక్ సాంగ్స్‌ను పాడడంలో మంచి పేరు తెచ్చుకుంది. యూట్యూబ్‌లో ఆమె వీడియోలు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇండియన్-అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ లిశా మిశ్రా పాటలను రికార్డ్ చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. బాలీవుడ్ సినిమాలలో కూడా పాడింది. ఇండియన్ ఐడల్ జూనియర్‌గా 2015లో సంగీత ప్రపంచానికి పరిచయం అయింది భువనేశ్వర్‌కు చెందిన అనన్య నందా. బాలీవుడ్ పాటల్లోనే కాదు క్లాసికల్‌లోనూ మంచి పేరు తెచ్చుకుంది. మెలోడియస్ వాయిస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

బోస్టన్ (యూఎస్)లో పుట్టిన అవంతి నగ్రల్‌కు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ముంబైకి వచ్చిన తరువాత తన పాషన్‌నే కెరీర్‌గా చేసుకుంది. మ్యూజిక్‌లో రకరకాల జానర్స్‌ను మిక్స్ చేయడంలో గట్టి పట్టు సాధించిన అవంతికి యూట్యూబ్ చానల్ కూడా ఉంది. ఇందులో తన లైవ్ పర్‌ఫార్‌మెన్స్ వీడియోలను అప్‌లోడ్ చేస్తుంది. అవంతికి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

ఆర్ అండ్ బీ, హిప్-హాప్, సోల్, పాప్ మ్యూజిక్‌లలో బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటోంది ఇలీన హ్యాట్స్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. ముంబైకి చెందిన సాచి రాజాధ్యక్ష ఆల్ట్-పాప్ మ్యూజిక్‌లో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఆమె పవర్‌ఫుల్, సోల్ వాయిస్‌కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

దియ నుంచి అవంతి వరకు ఎందరో, ఎందరెందరో యంగ్ మ్యూజిషియన్స్ సంగీతం పట్ల అంకితభావంతో సెల్ఫ్-మేడ్ సూపర్‌స్టార్‌లుగా ఎదిగారు. ఎంతోమంది ఔత్సాహికులకు రోల్ మోడల్స్‌గా మారారు.



స్పాటిఫైతో ప్రయాణం ప్రారంభించి స్టార్‌గా ఎదిగిన ఆర్టిస్ట్‌లలో జస్లీన్ రాయల్ ఒకరు. సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. హిట్ బాలీవుడ్ ట్రాక్స్ కంపోజ్ చేసింది. 'ప్రపంచ ప్రేక్షకులతో కనెక్ట్ కావడానికి, శ్రోతల అభిప్రాయాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులు చేయడానికి స్పాటిఫై ఉపయోగపడింది' అంటుంది జస్లీన్ రాయల్.

సినిమా

- తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
- రూ. రెండు కోట్లు వసూలు చేసిన తొలి తెలుగు చిత్రం
- జాతీయ అవార్డు తెచ్చుకున్న తొలి తెలుగు పాట 'తెలుగు వీర లేవరా...'
- ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం

అల్లూరికి అర్ధ శతాబ్దం

'మా మన్యం దొర సీతారామరాజు వచ్చాడు'.... ప్రజల్లో సంబరం. దొరకు పాదాభివందనం చేశారు. కానీ... అతను నిజమైన దొర కాదు. మన్యం దొర అల్లూరి సీతారామ రాజు గెటప్ వేసుకున్న నటుడు. అప్పటికి నిజమైన అల్లూరి సీతారామరాజుని చూసిన కొందరు వృద్ధులు లొకేషన్లో ఆ గెటప్‌లో ఉన్న నటుడికి పాదాభివందనం చేశారు. వెండితెరపై సీతారామరాజుగా కనిపించక ముందే అలా షూటింగ్ లొకేషన్లో ప్రజల చేత 'భేష్' అనిపించుకున్నారు కృష్ణ. అల్లూరి సీతారామరాజు గెటప్ అంటే కృష్ణ తప్ప వేరే ఏ నటుడికీ నప్పదు అనేంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు సూపర్ స్టార్. 1974 మే 1న విడుదలైన 'అల్లూరి సీతారామరాజు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిత్రం యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొన్ని విశేషాలు తెలుసుకుందాం...



ఎన్టీఆర్ హీరోగా నటించిన 'అగ్గిరాముడు' సినిమా 1954 ఆగస్టు 5న విడుదలైంది. బుర్రిపాలెంకు చెందిన కృష్ణ తెనాలిలో ఆ సినిమా చూశారు. అందులో అల్లూరి గురించి బుర్రకథగా చెప్పే సీన్ కృష్ణను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'జై సింహ'ని కూడా చూశారు కృష్ణ. ఆ సినిమా పాటల పుస్తకం చివరి పేజీలో ఎన్టీఆర్ తర్వాతి చిత్రం 'అల్లూరి సీతారామరాజు' అనే ప్రకటనతో పాటు అల్లూరి గెటప్‌లో స్కెచ్‌తో గీసిన ఎన్టీఆర్ బొమ్మ ఉంది. ఆ సినిమా కోసం కృష్ణ ఎదురు చూశారు. అయితే ఆ సినిమా ప్రారంభమైనా తర్వాత ఆగిపోయింది. పై చదువుల కోసం ఏలూరు వెళ్లిన కృష్ణకి నాటకాలపై ఆసక్తి కలిగింది. అది కాస్తా సినిమాలవైపు మళ్లడంతో చెన్నైకి చేరుకున్నారు. అప్పుడు ప్రజా నాట్యమండలి రాజారావు బృందం ప్రదర్శించిన 'అల్లూరి సీతారామరాజు' నాటకానికి మంత్రముగ్ధుడయ్యారు కృష్ణ. ఆ తర్వాత హీరో అయిన కృష్ణ 'అసాధ్యుడు'లో (1968) అంతర్నాటకంలో భాగంగా సీతారామరాజు వేషం వేశారు. ఆ వేషంలో చక్కగా ఉన్నారంటూ జనాలు కితాబిచ్చారు. దీంతో తాను హీరోగా అల్లూరి చరిత్రతో సినిమా తీస్తే బాగుంటుందనుకున్నారు కృష్ణ. అయితే 1972లో శోభన్‌బాబు హీరోగా సీతారామరాజు మూవీ నిర్మించనున్నట్లు డి. లక్ష్మీ నారాయణ (డీఎల్) ప్రకటించారు. కానీ అనారోగ్యం వల్ల ఆ ప్రయత్నం విరమించుకున్నారాయన. కృష్ణ హీరోగా 'పెద్దలు మారాలి' సినిమా తీశారు డీఎల్. ఆ చనువుతో సీతారామరాజు కథని కృష్ణకి ఇచ్చి, ఆసక్తి ఉంటే సినిమా తీసుకోమన్నారు. అలా 'అల్లూరి సీతారామరాజు' చేసే అవకాశం కృష్ణకి వచ్చింది.



డేరింగ్ అండ్ డ్యాషింగ్ కృష్ణ

కృష్ణకు 'డేరింగ్ అండ్ డ్యాషింగ్' అని పేరు. 'అల్లూరి సీతారామరాజు' కథలో వాణిజ్యపరమైన అంశాలు ఉండవని, పైగా హీరో చనిపోతాడని ఫైనాన్స్ ఇవ్వడానికి ఫైనాన్షియర్లు, పంపిణీ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. 'ఇంత రిస్క్ అవసరమా.. ఈ సినిమా వద్దు' అని శ్రేయోభిలాషులు కృష్ణకు చెప్పారు. ఎన్టీఆర్ కూడా వద్దనే అన్నారు. అయినా తాను ఓ హీరోగా రూపొందిన 'దేవుడు చేసిన మనుషులు' శత దినోత్సవంలో అల్లూరి సీతారామరాజు సినిమా తీస్తున్నానని, అది తన నూరో చిత్రంగా ఉంటుందని కృష్ణ ప్రకటించారు. 1973 డిసెంబరులో మద్రాస్ వాహినీ స్టూడియోలో షూటింగ్ ఆరంభమైంది. అల్లూరి సీతారామరాజు గెటప్‌లో ఉన్న కృష్ణపై ఫస్ట్ షాట్ తీశారు. సినిమా మొదలుపెట్టినప్పట్నుంచి అనేక ఇబ్బందులు. చింతపల్లి అడవిలో షూటింగ్ కాబట్టి అక్కడ గెస్ట్ హౌస్‌లు లేకపోవడంతో యూనిట్‌లోని దాదాపు ఐదువందల మందికి ఒక కాలనీలా తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తులో కొండ ప్రాంతంలో షూటింగ్. భయంకరమైన చలి. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ చేశారు. దర్శకుడు రామచంద్రరావు అస్వస్థతకి గురి కావడం ఓ ఊహించని షాక్. ఆయన్ను చెన్నైకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం చేయించినా కోలుకోలేదు. ఫిబ్రవరి 14న తుది శ్వాస విడిచారు. మిగతా భాగాన్ని కృష్ణ తెరకెక్కించారు. యుద్ధ సన్నివేశాలను దర్శకుడు కేఎస్ఆర్ దాస్ రూపొందించారు. రామచంద్రరావు మీద గౌరవంతో దర్శకుడిగా ఆయన పేరే ఉంచేశారు కృష్ణ.

సినిమా స్కోప్.. ఈజీ కాదు

తెలుగులో పూర్తి స్థాయిలో రూపొందిన తొలి సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. అయితే అప్పుడు సినిమా స్కోప్ అంత ఈజీ కాదు. ఈ మూవీకి వీఎస్ఆర్ స్వామి ఛాయాగ్రాహకుడు. అప్పట్లో సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసేందుకు రెండే లెన్స్‌లు ఉండేవట. కాగా సినిమా స్కోప్ ఫార్మాట్‌లో తీసే లెన్స్‌కి కెమెరా వ్యూఫైండర్స్ ఉండవట. దీంతో ఊహించుకుని ఫ్రేమ్ సెట్ చేసుకునేవారట. ఈ ప్రక్రియను వీఎస్ఆర్ స్వామి ముంబైలో అధ్యయనం చేసి రావడంతో 'అల్లూరి సీతారామరాజు' ఈజీగా చేయగలిగారు.

అల్లూరి చేయనన్న ఎన్టీఆర్

అల్లూరి సీతారామరాజు సినిమా మొదలుపెట్టి, ఆపినా ఆ సినిమా తీయాలన్న ఎన్టీఆర్ ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' వచ్చిన చాలా ఏళ్లకు ఆ సినిమా తీద్దామని పరుచూరి బ్రదర్స్‌తో అన్నారు ఎన్టీఆర్. కానీ సోదరులు వద్దని సలహా ఇచ్చి, కృష్ణ చేసిన సినిమా చూడమన్నారు. ఎన్టీఆర్ కోరిక మేరకు 'అల్లూరి సీతారామరాజు'ని ప్రత్యేకంగా చూపించారు కృష్ణ. "అద్భుతంగా తీశారు. నేను 'అల్లూరి సీతారామరాజు' తీయను" అన్నారు ఎన్టీఆర్.

మహారథి చేతికి స్క్రిప్ట్

త్రిపురనేని మహారథి చేతిలో డీఎల్ ఇచ్చిన స్క్రిప్ట్ పెట్టి, 'ఈ సబ్జెక్ట్‌లో సినిమా తీయడానికి కావాల్సినంత దమ్ము ఉందా' అడిగారు కృష్ణ సోదరుడు హనుమంతరావు. 'చాలా ఉంది' అన్నారు మహారథి. కానీ, తనకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో ఒక్క సన్నివేశం తప్ప మహారథికి వేరే ఏదీ నచ్చలేదు. పరిశోధనలు చేసి, స్క్రిప్ట్ తయారు చేశారు. దర్శకుడిగా వి. రామచంద్రరావును తీసుకున్నారు. సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్‌లో తీయాలని నిర్ణయించింది పద్మాలయా స్టూడియోస్ సంస్థ (కృష్ణ సొంత నిర్మాణ సంస్థ).

అల్లూరి పాటలు అజరామరం

'అల్లూరి సీతారామరాజు'లోని పాటలన్నీ సూపర్ హిట్. పి. ఆదినారాయణరావు ఈ సినిమాకు సంగీత దర్శకుడు. సినిమా ఆరంభంలో వచ్చే 'రగిలింది విప్లవాగ్ని..', సినిమా చివర్లో వచ్చే.. 'ఓ విప్లవజ్యోతి...' పాటలకు ఆరుద్ర సాహిత్యం అందించగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. 'వస్తాడు నా రాజు..' పాటను నారాయణరెడ్డి రాయగా, 'హైలెస్సా.. హైలెస్సా..', 'కొండ దేవతా నిన్ను కొలిచేవమ్మా..' పాటలను కొసరాజు రాశారు. 'తెలుగు వీర లేవరా..' పాటను శ్రీశ్రీ రాశారు. ఈ పాటను ఘంటసాలతోనే పాడించాలన్నది కృష్ణ సంకల్పం. ఆ సమయానికి ఘంటసాల ఆరోగ్యం సరిగా లేదు. ఆ తర్వాత ఘంటసాల ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఆయన ఈ పాట పాడారు. కానీ ఈ సినిమా విడుదల కాకముందే ఘంటసాల కాలం చేశారు. ఈ పాటకు వి. రామకృష్ణ గొంతు కలిపారు. ఈ పాటకుగాను జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డు శ్రీశ్రీని వరించింది. ఓ తెలుగు సినిమాలోని పాటకు జాతీయ పురస్కారం రావడం అదే తొలిసారి. అలాగే ఇదే సినిమాలోని 'వందేమాతరం అంటూ నినదించిన..', 'హ్యాపీ క్రిస్మస్..' పాట, 'అరుణాయ శరణ్యాయ..' శ్లోకం వంటివి కూడా వీనుల విందుగా ఉంటాయి.

రికార్డులు భళా

'అల్లూరి సీతారామరాజు' సినిమా 19 కేంద్రాల్లో (బెంగళూరుతో కలుపుకుని) వందరోజులు, 2 కేంద్రాల్లో 25 వారాలు, హైదరాబాద్‌లోని సంగం థియేటర్‌లో రజతోత్సవం, అలాగే షిఫ్టింగులతో ఏడాది పాటు ఆడటం విశేషం. ఈ చిత్రం స్వర్ణోత్సవం చెన్నైలోని ఉడ్‌ల్యాండ్స్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధులు ఇంటూరి వెంకటేశ్వరరావు, అనిసెట్టి సుబ్బారావు, దాశరథి, సుంకర సత్యనారాయణ, కేఎస్ గోపాలకృష్ణన్ వంటి వారిని సత్కరించారు. అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం రూ. పదివేలతో ఓ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాలను సీతారామరాజు సోదరుడు సత్యనారాయణరాజుకి అందించారు కృష్ణ. ఇలా ఈ సినిమాకి సంబంధించిన విశేషాలు చాలా ఉన్నాయి.

'అల్లూరి...' తర్వాత 'పాడి పంటలు'తోనే హిట్... 'అల్లూరి సీతారామరాజు' చూసిన విజయా వాహిని సంస్థ అధినేతల్లో ఒకరైన దర్శక-నిర్మాత చక్రపాణి అభినందించారు. కానీ 'ఈ సినిమా తర్వాత నీ సినిమాలు ఆడటం కష్టం' అని కూడా కృష్ణతో అన్నారు. ఆయన అన్న మాటలు నిజమయ్యాయి. 'అల్లూరి సీతారామరాజు' తర్వాత కృష్ణ చేసిన ప్రతి చిత్రాన్నీ ఈ సినిమాతో పోల్చారు ప్రేక్షకులు. దాంతో ఆ తర్వాత కృష్ణ నటించిన పది సినిమాలకు పైగా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. చివరికి పద్మాలయా స్టూడియోస్ నిర్మించిన 'పాడి పంటలు' (1976) విజయంతో హీరోగా కృష్ణ పూర్వ వైభవాన్ని పొందారు.

ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు



అబ్బూరి రవి

'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం డైలాగ్ రైటర్ అబ్బూరి రవి మాట్లాడుతూ– ''ఈ సినిమాలో పెళ్లి అనే సబ్జెక్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూనే, ఆడియన్స్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా తీశాం. ముఖ్యంగా ఇది పెళ్లి కాని ప్రతి వారు కోరుకునే కంటెంట్. క్లీన్ ఎంటర్‌టైనర్. 'ఆ ఒక్కటీ అడక్కు' అనేది ఈవీవీగారి క్లాసిక్ టైటిల్. ఈ సినిమాకు ఈ టైటిల్‌ను అన్నప్పుడు కాస్త భయం వేసింది. కానీ ఈ కథకు ఆ టైటిల్ సరిగ్గా సరిపోతుందని నరేశ్‌గారే సూచించారు. ఇక నాకు డైరెక్షన్ చేయాలని ఉంది. ఆ ప్రయత్నాల్లో ఉన్నాను. ప్రస్తుతం 'గూఢచారి 2', 'డెకాయిట్' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

ముఫాసా ఈజ్ బ్యాక్



హాలీవుడ్ లయన్ కింగ్ మళ్లీ వస్తున్నాడు. 1994లో వచ్చిన యానిమేటెడ్ మ్యూజికల్ డ్రామా 'ది లయన్ కింగ్' ఆధారంగా 'ది లయన్ కింగ్' టైటిల్‌తోనే సినిమా వచ్చింది. జోన్ ఫావ్రూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ముఫాసా, సింబ (ముఫాసా తనయుడు), ముఫాసా తమ్ముడు స్కార్‌లు ప్రధాన పాత్రధారులుగా 'ది లయన్ కింగ్' సినిమా కథనం సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా 'ముఫాసా: ది లయన్ కింగ్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ట్రైలర్, ఫస్ట్ లుక్ విడుదలైంది. డిసెంబరు 20న 'ముఫాసా: ది లయన్ కింగ్' రిలీజ్ కానుంది.

వినూత్న కథాంశంతో...

రవితేజ మహాదాస్యం హీరోగా మద్దుల మదన్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆర్ట్ మేకర్స్ సమర్పణలో సౌజన్య కావూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రచయిత పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తొలి సీన్‌కి విరాజ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సహనిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.



విరాజ్ అశ్విన్, రవితేజ మహాదాస్యం

తిండిబోతు దెయ్యం



నరసింహా, మోనిక, వాసవి

నరసింహా బోదాసు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కామెడీ హారర్ ఫిల్మ్ 'తిండిబోతు దెయ్యం'. మోనికా సమత్తార్, తన్నీరు వాసవి హీరోయిన్లు. శిరీష నరసింహా బోదాసు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శిరీష నరసింహా బోదాసు కెమెరా స్విచ్చాన్ చేయగా, సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు క్లాప్ ఇచ్చి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ సినిమాలో కొత్తదనం ఉంటుంది'' అన్నారు నరసింహా బోదాసు.

నడిరోడ్డుపై ధాన్యం పోసి..

కొనుగోళ్లలో జాప్యంపై రైతుల నిరసన


ధాన్యం రోడ్డుపై పోసి నిరసన తెలుపుతున్న రైతులు

భువనగిరి టౌన్: ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై యాదాద్రి భువనగిరి జిల్లా వలి గొండ మండలం గోకారం, సంగెం, వర్కట్‌పల్లి గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై రోడ్డుపై ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు గడుస్తున్నా ఇప్ప టికీ ఖరీదు చేయడం లేదన్నారు. మిల్లుల వద్దకు రాగానే 'ఏ'గ్రేడ్ ధాన్యాన్ని 'బీ'గ్రేడ్ ధాన్యంగా మార్చి, క్వింటాకు 5 కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపించారు. తాలు, తేమ పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకుని తమకు నష్టం కలగ కుండా చూడాలని రైతులు కోరారు. కాగా, రైతుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడి కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హమాలీ..అలవోకగా

ధాన్యం కాంటాల్లో నారీమణులు

నిజాంసాగర్(జుక్కల్): ధాన్యం కాంటాలకు హమా లీల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పని చేసేందుకు కొందరు మహిళలు ముందుకొచ్చారు. పురుషులతో సమానంగా ధాన్యం కాంటాలు వేస్తూ కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత తీరుస్తు న్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కొనుగోళ్లు జోరందుకున్న నేప థ్యంలో హమాలీల కొరత కారణంగా కాంటాలు ఆలస్యమవుతున్నాయి. దీంతో మాగా గ్రామానికి చెందిన 15 మంది మహిళలు ఈ పని చేసేందుకు సిద్ధమయ్యారు. రోజూ ధాన్యం బస్తాలు, ఎత్తడం, తూకాలు చేయడం, గన్నీ బస్తాల్లో ధాన్యం నిం


మాగి గ్రామంలో ధాన్యం కాంటా వేస్తున్న మహిళలు

పడం వంటి పనులు చేస్తున్నారు. మూడు రోజుల నుంచి మహిళలు ఈ పనుల్లో నిమగ్నం కావడంతో ఈ కేంద్రం నుంచి ఇప్పటి వరకు 14 లారీల్లో ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించారు.

కాంటా వేసేందుకు భయపడుతున్నారు



వడ్లు కాంటా వేసేందుకు మగవారే భయపడుతున్నారు. కాంటాలు జరగక వడ్ల కుప్ప లు పేరుకుపోయాయి. వరి కోతలు పూర్తి కావడం తో హమాలీ పని చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మేం వచ్చి ఈ పనులు చేస్తున్నాం.

- ధ్యానబోయిన రామవ్వ, కూలీ

మహిళలు తలుచుకుంటే ఏ పని ఆగదు



మూడు రోజుల నుంచి కాంటాలు పెడుతున్నాం. ఇప్పటి వరకు వెయ్యి బస్తాలు కాంటాలు చేశాం. మహిళలు తలుచుకుంటే ఏ పని ఆగదు. అందుకే ఈ పని చకాచకా చేస్తున్నాం.

- కొల్ల కవిత, కూలీ, మాగి

క్లుప్తంగా...

వడ్లు నేర్పుతూ.. కుప్పకూలాడు

- వడదెబ్బతో కల్లం వద్దే రైతు మృతి



చొప్పదండి: ధాన్యం అమ్ముకోవడానికి వెళ్లి వడ్లు నేర్పుతూ వడ దెబ్బకు గురై రైతు మృ తి చెందిన ఘటన కరీం నగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన ఐతరవేని రాజేశం (47) తన మూడె కరాల పొలంలో సాగు చేసిన వరిధాన్యాన్ని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఆర్నకొండ పీఏసీఎస్ (ప్యాక్స్) సెంటర్‌లో సోమవారం రాత్రి కుప్ప పోశాడు. మంగళవారం ఉద యమే కల్లంలో వడ్లు నేర్పడానికి వెళ్లాడు. మధ్యాహ్నం వడదెబ్బకు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు.

ఓయూ హాస్టళ్లు కొనసాగుతాయి: రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్స్ కొనసాగు తాయని రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మంగళ వారం తెలిపారు. పలు ఉద్యోగాలకు, యూజీసీ నెట్, టీఎస్ టెట్ తదితర పోటీ పరీ క్షలు ఉన్నందున విద్యార్థుల విజ్ఞప్తి మేరకు హాస్టల్స్‌ను కొనసాగించనున్నట్లు వెల్లడిం చారు. మెస్ బిల్లులు చెల్లిస్తాం భోజనశాలను కూడా తెరిచి ఉంచాలని విద్యార్థులు కోరారు. దీంతో వీసీ రవీందర్‌తో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు.

వారంపాటు తీవ్ర వడగాడ్పులు!

- దక్షిణ, నైరుతి దిశల నుంచి వీస్తున్న బలమైన గాడ్పులు
- పొడి వాతావరణంతో పెరిగిన వడగాల్పుల తీవ్రత
- 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న వారం రోజులపాటు వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల కుతోడు పొడి వాతావరణం, దక్షిణ, నైరుతి దిశల నుంచి గాలుల ప్రభావం వల్ల వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని తెలిపింది. ముఖ్యంగా 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, మహబూ బాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారా యణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలుచోట్ల ఈ నెల 6వ తేదీ వరకు తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా బుధ, గురువా రాల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొం ది. అయితే ఈ నెల 6 వరకు తీవ్ర వడగాడ్పులు వీచే



అవకాశం ఉన్నప్పటికీ అక్కడక్కడా తేలికపాటి వానలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రామగుండం.. అగ్నిగుండం..

మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే రామగుండంలో 44.4 డిగ్రీల సెల్సి యస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఖమ్మంలో సాధా రణం కంటే 3.6 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో 3 డిగ్రీల చొప్పున అధికంగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా జైనలో అత్యధికంగా 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా నల్లగొండ జిల్లా మాడు గులపల్లిలో 46.2, జగిత్యాల జిల్లా అల్లీపూర్‌లో 46.1, కొల్వాయ్ 46 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. ఈ సీజన్‌లోకెల్లా ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మంగళవారం ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
రామగుండం	44.4
నిజామాబాద్	44.1
ఖమ్మం	43.5
మహబూబ్‌నగర్	43.3
మెదక్	43.2
నల్లగొండ	43.0
భద్రాచలం	43.0
ఆదిలాబాద్	42.8
హనుమకొండ	42.0
హైదరాబాద్	41.9
విజయవాడ	41.0
విశాఖపట్నం	38.0

పదిరోజులు 'భాగ్యనగర్' బంద్

రామగుండం: సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 10వ తేదీ వరకు రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకు న్నారు. ఆ తర్వాత కూడా ఇదేనెల 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడో రైల్వేలైన్‌లో సాంకేతిక పనుల నేపథ్యంలో ఈ రైలును రద్దు చేస్తున్నట్లు తెలిసింది. కోల్‌బెల్ట్ జిల్లాల నుంచి సికింద్రాబాద్‌కు ప్రతిరోజూ తక్కువ ధరలతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు ప్రయాణం చేసేందుకు భాగ్యనగర్ రైలు సౌకర్యంగా ఉంటుంది. దీనిని తరచూ రోజులు, నెలల తరబడి రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లేని అడ్డంకులు సాధా రణ, మధ్య తరగ తి ప్రజలు ప్రయాణించే రైళ్లకు ఎందుకనే ప్రశ్న లు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రజాప్రతిని



ధులు స్పందించాలనే డిమాండ్ వస్తోంది.

పారిశుద్ధ్య కార్మికుడికి కలెక్టర్ పాదాభివందనం


కల్వల సాయిలుకు పాదాభివందనం చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్: 33 ఏళ్లపాటు మురుగునీటి కాలువలు శుభ్రం చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వా మి అయిన పారిశుద్ధ్య కార్మికుడు కల్వ ల సాయిలు సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆయనకు పాదాభివం దనం చేశారు. అందరూ ప్రభుత్వ ఉ ద్యోగులేనని, ఇందులో పెద్ద, చిన్న తే డా ఉండొద్దన్నారు. పెద్దపల్లి మున్సిపా లిటీలో పారిశుద్ధ్య కార్మికుడు సాయిలు, ఎలక్ట్రీషియన్ రాంచంద్రం మంగళ వారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో పాల్గొన్న కలెక్టర్ పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, కరోనా సమయంలోనూ బంధుమిత్రులు దగ్గరికి రాకున్నా.. సఫాయి కార్మి కులే ప్రాణాలకు తెగించి ముందుకొచ్చి సేవలు అందించారని గుర్తుచేశారు.

9 నుంచి హజ్ యాత్రలు షురూ

- 2024 హజ్ యాత్ర షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హజ్ –2024 యాత్ర షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ మంగళవారం విడుదల చేసింది. మే నెల 9 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర హజ్ యాత్రికుల టూర్ షెడ్యూల్ ఉంటుంది. ఈ ఏడాది రాష్ట్ర హజ్ కమిటీ నుంచి దాదాపు 13,600 మంది యాత్రికులు హజ్ ఆరాధనలకు సౌదీఅరేబియాలోని జిద్దా నగరానికి వెళ్లన్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 13,600 మంది యాత్రికుల్లో 11,200 మంది తెలంగాణ రాష్ట్రం నుం చి, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 1800 మంది, కర్నాటక, మహారాష్ట్ర నుంచి దాదాపు 600మంది యాత్రికులు హైదరాబాద్ నుంచే వెళ్లనున్నట్లు తెలిపారు. మే 9 నుంచి 25వరకు 16 రోజుల్లో 35 విమానాల్లో సౌదీ ఆరేబియాలోని జిద్దానగరానికి చేరుకుంటారు. యాత్రికులు తమ షెడ్యూల్ కంటే 48 గంటల ముందే నాంపల్లి హజ్ హౌస్‌లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. 20 కేజీల్లోపు బరువుండే రెండు లగేజ్ బ్యాగ్‌లు, 7 కేజీల హ్యాండ్ క్యారీ మాత్రమే తీసుకురావాలని స్పష్టం చేశారు. యాత్రకు సంబంధించిన ప్రక్రి యలు పూర్తి చేసేందుకు హజ్ హౌస్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగేజ్, కరెన్సీ, ఇమిగ్రేషన్, కస్టమ్స్‌తో పాటు బోర్డింగ్ పాస్‌లు కూడా హజ్‌హౌస్‌లోనే యాత్రికులకు అందజేస్తారు.

జిల్లా వార్తలు

90.39 శాతం ఉత్తీర్ణత

- పదో తరగతిలోనూ అమ్మాయిలదే హవా
- 12,294 మందికి 11,112 మంది పాస్
- 87 పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు
- గతేడాది కంటే ఉత్తీర్ణత పెరిగినా.. రాష్ట్రంలో 26వ స్థానం

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో బాలికలే పైచేయిగా నిలిచారు. మంగళ వారం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలో 90.39 శాతం మేర ఉత్తీర్ణత సాధించినా రాష్ట్ర స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాల్లో 78.53 ఉత్తీర్ణతతో 29వ స్థానంలో నిలిచింది. జిల్లా లో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు 303 ఉం డగా, 12,294 మంది విద్యార్థులు పరీక్షలకు హాజర య్యారు. 5,875 మంది బాలురు పరీక్ష రాయగా 5,181 మంది, 6,419 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా 5,931 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 88.19 శాతం, బాలికలు 92.40 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. గతేడాది కంటే 11.86 శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాలోని 52 ప్రభుత్వ పాఠశాలలు, 35 ప్రైవేటు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. మొత్తం గా 70 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధిం చారు. జిల్లాలోని ఒక ప్రైవేటు పాఠశాలలో జీరో శాతం ఫలితాలు నమోదయ్యాయి.

ఈ స్కూళ్లలో 100 శాతం ఫలితాలు..

జిల్లాలో 87 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి. వీటిలో ఎయిడెడ్ ఒకటి, ఆశ్రమ పాఠశాలలు తొమ్మిది, ప్రభుత్వ పాఠశాల ఒకటి, కేజీబీవీ రెండు, మినీ రెసిడెన్షియల్ రెండు, బీసీ సంక్షేమ మూడు, సాంఘిక సంక్షేమ రెండు, గిరిజన సంక్షేమ నాలుగు, జెడ్పీ పాఠశాల లు 28 ఉన్నాయి. వీటితో పాటు 35 ప్రైవేటు పాఠ శాలల్లోనూ 100 శాతం ఫలితాలు నమోద య్యాయి. మొత్తంగా 70 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, అత్యధికంగా లక్ష్మీదేవిపల్లి మం డల విద్యార్థులు 19 మంది, అత్యల్పంగా బూర్గం పాడు, చర్ల మండలాల నుంచి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు.

రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్‌కు 15 వరకు అవకాశం..

మార్కులు తక్కువగా వచ్చిన, ఫెయిల్ అయిన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వాల్యుయేషన్ చేయిం చాలనుకుంటే ఈనెల 15వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 500, రీ వాల్యుయేషన్ రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇక సప్లిమెంటరీ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈనెల 16 వరకు చదివిన పాఠశాలలోనే ఫీజు చెల్లించవచ్చని అధికా రులు వెల్లడించారు. మూడు సబ్జెక్టుల్లోపు రూ.110, ఆపైన రూ.125 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 3 నుంచి 13 వరకు పరీక్షలు నిర్వ హిస్తామని పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే లా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ప్రియాంక ఆల విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

'గిరిజన సంక్షేమం'లో పెరిగిన ఉత్తీర్ణత

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది 76 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 90.55 శాతానికి చేరింది. గతేడాది 11 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది ఆ సంఖ్య 18కి చేరడం విశేషం. జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 1,878 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,711 మంది ఉత్తీర్ణత సాధిం చారు. టీడబ్ల్యూ హాస్టళ్లలో 198 మందికి 167 మం ది ఉత్తీర్ణులయ్యారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 20 మందికి 20 మంది ఉత్తీర్ణత సాధించారు. అశ్వా రావుపేట మండలం భీమన్నగూడేనికి చెందిన కోవాసి జ్యోతి చందు 10 జీపీఏ సాధించింది. ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశా లలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 479 మందికి 407 మంది ఉత్తీర్ణత సాధించారు.

బీసీ సంక్షేమ శాఖలో..

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని 17 వెనుకబడిన తర గతుల సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 167 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 161 మంది(96.40 శాతం) ఉత్తీర్ణత సాధించారని జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర తెలిపారు. ప్రత్యేక తర గతుల నిర్వహణ, విద్యార్థులు కష్టపడి చదవడం, కలెక్టర్ ప్రియాంక ఆల కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

> **గతేడాది కంటే ఉత్తీర్ణత పెరిగింది**
>
> గతేడాది కంటే ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. రాష్ట్ర స్థాయిలో జిల్లా 29 నుంచి 26వ స్థానానికి చేరింది. రానున్న కాలం లో మరింతగా కష్టపడి మెరుగైన ఉత్తీర్ణత సాధించే లా అడుగులు వేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో టిఫిన్, భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండడం, నాణ్యమైన విద్య లభిస్తుండడంతో ఈ ఏడాది గణనీయంగా అడ్మిషన్లు పెరుగుతాయి.
>
> – ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

మాతోనే పేదలకు న్యాయం

- బీజేపీ, బీఆర్‌ఎస్ గెలిస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు
- రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమాన అభివృద్ధి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

కూసుమంచి/మధిర/ఖమ్మం వన్‌టౌన్/వై రా/కొణిజర్ల/: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళ వారం కూసుమంచి, మధిర, వైరా, కొణిజర్లల్లో జరిగిన సమావేశాలతో పాటు ఖమ్మంలోని కాంగ్రె స్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమా వేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల న్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మాదిరి సం క్షేమ పాలన అందాలంటే మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిం చాలని కోరారు. కేసీఆర్ హయాంలో ధనిక రాష్ట్రా న్ని దివాళా తీయించగా.. తాము ప్రాధాన్యతాక్ర మంలో పనిచేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నా మని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కానీ, బీఆర్‌ఎస్ కానీ గెలిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఎదురవుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, త్వర లోనే మిగిలినవీ నెరవేరుస్తామని తెలిపారు. బీజే పీకి బీ టీమ్‌గా ఉన్న బీఆర్‌ఎస్‌కు లోక్‌సభ ఎన్నిక ల్లో ఓట్లు అడిగే హక్కు లేదని చెప్పారు. ఏదిఏమైనా ఇండియా కూటమి అత్యధిక స్థానాలు గెలుచు కోవడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయ మని భట్టి ధీమా వ్యక్తం చేశారు.

- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ** ప్రతిపక్షాల నేతలు సిగ్గు లేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని విమ ర్శించారు. అయినా కేసీఆర్ చెప్పే అబద్ధాలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జూన్, జూలై నెలల్లోనే కాల్వలకు నీరు ఇవ్వకుం డా ఇప్పుడు తమపై నింద మోపడం సరికాద న్నారు. కాగా, కార్యకర్తలు క్రమశిక్షణతో మెల గాలని, వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థి రఘు రాంరెడ్డిని గెలిపించాలని.. ముమ్ముందు అన్నీ మంచి రోజులే ఉంటాయని పేర్కొన్నారు.
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ** తాము ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలవు తున్నా బీఆర్‌ఎస్ నేతలు దుష్ప్రచారం చేయటం సిగ్గుచేటన్నారు. ప్రజలకు అండగా నిలిచేది కాం గ్రెస్ పార్టీయేనని, ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 4న కొత్త గూడెంలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగస భను విజయవంతం చేయాలన్నారు. అలాగే, ఈనెల 7న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సినీ హీరో వెంకటేష్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి తర పున ప్రచారానికి వస్తారని తెలిపారు.
- **ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ** ఖమ్మం జిల్లా అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట అని, ఇక్కడ గెలిచేది కాంగ్రెస్సేనేనని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ దొంగ మాటలను ప్రజలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఖమ్మంలో గతంలో 13 మంది బయట నుండి వచ్చి గెలిచారని.. ఈసారి జిల్లా వాసి రఘురాంరెడ్డి పోటీలో ఉన్నందున అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడగా ఎమ్మెల్యే మాలోతు రాం దాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్ర సాద్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని బేబీ స్వర్ణకు మారి, దొండపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ కోట రాంబాబు, పిడమర్తి రవి, పోట్ల నాగేశ్వర రావు, ఎం.డీ.ముస్తఫా, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, నూతకాని జైపాల్, హరీష్‌రెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, మట్టె గుర వయ్య, ఎం.డీ.హఫీజుద్దీన్, సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, కోట వెంకటకృష్ణ మిక్కిలినేని నరేందర్, రావర్తి శరత్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, పగడాల మంజుల, చోటేబాబా, యర్రా బాబు, భూక్యా వీరభద్రం, గోసు మధు, వడ్డె నారాయణరావు, కోసూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాగా, కొణిజర్లలో రోడ్డు షో గంటన్నర పాటు కొనసాగగా ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వాహనాలను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారని మండిపడ్డారు.

బీజేపీ ఓటమితోనే దేశ ఐక్యత

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని


కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని పరిచయం చేస్తున్న తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తూ.. రాక్షస శక్తిగా ముందుకొస్తున్న బీజేపీని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకే వేదిక పైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇం దులో భాగంగా భువనగిరి మినహా మిగిలిన 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలో నిర్వహించిన సీపీఎం శ్రేణుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి రఘురాంరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుద ర్శన్‌రావు పాల్గొన్నారు. ఈమేరకు తమ్మినేని వీరభ ద్రం మాట్లాడుతూ బీజేపీ వెనక ప్రజల మధ్య విద్వే షాలను రగిల్చే ఫాసిస్టు సిద్ధాంతం ఉందన్నారు. బీజే పీని ఓడించడం ద్వారానే దేశ ఐక్యత సాధ్యమన్నారు. కాగా, జిల్లా వాసి అయిన రఘురాంరెడ్డి గెలుపు బాధ్యతను సీపీఎం స్వీకరిస్తుందని తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతు ఇచ్చి ఆయన విజయానికి సహకరించాలని సీపీఎం శ్రేణులను కోరారు. నాయ కులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, కాసాని ఐలయ్య, ఎం.సుబ్బారావు, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, భూక్యా వీరభ ద్రం, బుగ్గవీటి సరళ, రాంబాబు, కళ్యాణం వెంకటే శ్వర్లు, వై.విక్రమ్, ఏజే.రమేశ్, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, కె.పుల్లయ్య పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

భద్రాచలంఅర్బన్ : దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తయారు చేసిన లడ్డూ ప్రసాదాలను అన్నదాన సత్రం వద్ద చెత్తకుప్పలో పడేశారని మం గళవారం స్థానిక సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన ఘటనపై ఆలయ ఈఓ రమాదేవి తీవ్రంగా స్పందించారు. ఇది తప్పుడు ప్రచారమని, అలాం టి వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరిం చారు. శ్రీరామనవమి రోజున పట్టణానికి చెందిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు దేవస్థానం పేరుతో నకిలీ లడ్డూలు(నూనెతో చేసినవి) విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వారి నుంచి 500 లడ్డూ లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన లడ్డూల్లో పాడైన వాటిని బయోగ్యాస్ ప్లాంట్ లో వినియోగించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న అన్నదాన సత్రం వద్ద పడేశామని తెలిపారు. కొద్దికొద్దిగా వినియో గిస్తున్న క్రమంలో 'ఆలయంలోని లడ్డూలు పడేశారంటూ' తప్పుడు ప్రచారం మంగళవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిందని వివరించారు. తమ వివరణ లేకుండా ఆలయ కీర్తి ప్రతిష్ఠలకు భంగం వాటిల్లేలా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.